

# శ్రీ కాళహస్తీశ్వర వైభవం

శ్రీ ఎం. నాగేంద్రప్రసాద్, తిరుపతి.

తిరువారూరులో పుట్టుక. కాశీలో మరణం, కాళహస్తి ప్రవేశం ముక్తి నిస్తాయని ఆస్తిక మహాజనులు చెబుతారు.

కాశ్యాంతు మరణాన్ముక్తిః
భూమౌ దక్షిణ కైలాసే
ప్రవేశాన్ముక్త ఏవ సః.

కాశీలాంటి పుణ్యక్షేత్రంలో మరణం పొందితే తప్ప ముక్తి లభించదని, కానీ దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తిలో ప్రవేశం చేతనే ప్రాణులకు ముక్తి కరతలా మలక మౌతుందని ఈ శ్లోకార్థం. శివక్షేత్రా లన్నింటిలో శ్రీకాళహస్తి క్షేత్రం శిరోమణిలా ప్రసిద్ధి చెందింది.

## చలించే దీప కళికలు

పరమ పవిత్రమైన పంచ లింగాలలో పరమేశ్వరుడు వాయు లింగంగా స్వయం వ్యక్తమైన క్షేత్రం శ్రీకాళహస్తి.

భూమి, నీరు, అగ్ని, ఆకాశం, వాయువు ఇవి పంచ భూతాలు. ఈ పంచ భూతాలతోనూ శివుడు లింగాకృతిగా కొన్ని చోట్ల వెలిశాడు. కంచిలో ఏకాంబరేశ్వరుడు పృథ్వీలింగంగా, జంబుకేశ్వరంలో జల లింగంగా, అరుణాచలంలో (అగ్ని) తేజో లింగంగా, చిదంబరంలో ఆకాశ లింగంగా, శ్రీకాళహస్తిలో వాయు లింగంగా స్వయం వ్యక్తమయ్యాడు కైలాసపతి.

వాయువు కంటికి కనబడదు. అనుభూతి పొందవలసిందే. కాళహస్తీశ్వరుని గర్భాలయంలో స్వామికి కుడి ప్రక్కన ఏ మాత్రం గాలి చొరరాని చోట వున్న రెండు జ్యోతులు నిరంతరం చలిస్తూ వుండటం స్వామి వాయులింగ స్వరూపుడని తెలుసుకోడానికి తార్కాణం. అక్కడున్న ఐదు దీపాలలో ఈ రెండు మాత్రమే ఊగిసలాడటం, గాలి ప్రవాహసిద్ధాంతానికి అతీతంగా వున్నట్లు చెప్పక తప్పదు.



శ్రీ కాళహస్తీశ్వరస్వామివారు

## భక్త ప్రియుడు భోళా శంకరుడు

పరమేశ్వరుడు పరమ దయాళువు, భోళా శంకరుడు అనే నానుడికి ఈ క్షేత్రమే నిదర్శనం. ఏ ధర్మశాస్త్ర పురాణాలు తెలియని కన్నప్ప సాయుజ్యం పొందిన చోటిది. ఈ స్వామికి భక్తులపై అత్యంత శ్రద్ధానురక్తి. దానికి నిదర్శనం శివభక్తుల్లో ఉత్తముడుగా పరిగణింపబడ్డ కన్నప్పకు ఈ క్షేత్రంలో మహోన్నత స్థానం లభించడమే.

తన భక్తుడైన కన్నప్ప గుడిని కైలాసగిరి శిఖరంపైన తన ఆలయం కన్నా ఉన్నత స్థానంలో వుంచాడు. ఇంకా ఆలయంలో తన ప్రక్కనే వుంచుకున్నాడు. (కన్నప్ప కాళహస్తీశ్వరుని ఆలయంలో స్వామికి కుడి వైపున చేరువలో వుంటాడు).

**మార్చి । మహా శివరాత్రి సందర్భంగా ప్రచురిస్తున్నాం.**
**నం**

## తిన్నడి శివభక్తి

బోయరాజు నాథనాథుడు, తండె లకు సుబ్రహ్మణ్యేశ్వరుని వర ప్రసాదంగా జన్మించాడు తిన్నడు. పదహారేళ్ళ తిన్నడు సాహసిక యువకు డని పించుకున్న తర్వాత అడవి రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు అతని తండ్రి.

ఓ సారి తిన్నడు అడవికి వేటకని బయలుదేరాడు. అక్కడ ఓ అడవి పందిని వేటాడుతూ అడవంతా కలయ దిరిగాడు. ఇదే అతని జీవితంలో మార్పు తెచ్చిన బాట. అటవీ వృక్షాల నడుమ సాగుతుంటే గడ్డి పొదల తీగలమధ్య వున్న శివలింగానికి చేరు వయ్యేసరికిఅద్వితీయమైన ప్రశాంతత, అనిర్వచనీయమైన ఆనందం కలిగింది అతనిలో. మరికొంత దూరం సాగేసరికి మర్రి చెట్టు క్రింద మహాలింగం కన బడింది.

తిన్నడు సాష్టాంగపడ్డాడు. కౌగలించుకున్నాడు. 'శివా, పరమ శివా' అంటూ ఏడ్చాడు. ఒంటరి వాడవై తిండి, నీళ్ళు లేకుండా ఈ అడవిలో ఇలా గడుపుతున్నావా పరమేశ్వరా! మా ఊరికి వస్తే చిన్నక్క, పెద్దక్కల కమ్మని వంటకాలు పలు రకాల ఫలరసాలు, సర్వమూ సమకూర్చ గలం. మా వారంతా అన్ని వేళలా నిన్ను సేవిస్తూ గడుపుతారు స్వామీ! నాతో రా!'' అని అమాయకంగా ప్రాధేయ పడ్డాడు.

అంతలో తన పరివారమంతా వచ్చింది. ఇంటికి తిరిగి రమ్మని ఎంత చెప్పినా వినకుండా ఆ శివ లింగంతో మాట్లాడుతూనే వుండి పోయాడు. చెలికాళ్లంతా తిరిగి ఊరికి వెళ్ళి తిన్నని తల్లితండ్రులతో విషయం వివరించారు. తల్లిదండ్రులు పరుగు పరుగున అడవికి వచ్చి ఇంటికి మరలి పోదాం రమ్మని ఎంత నచ్చ చెప్పినా వినలేదు.

## ఉచ్ఛిష్టక్షేత్రం

శివలింగం తిన్నడి దృష్టికి రాక ముందే శివ బ్రాహ్మణుడు అనే అర్చకుడు ఆగమ శాస్త్ర విధుల ప్రకారం శివునికి ఇష్టమైన బిల్వపత్రాలు, పూలు పండ్లతో పూజలు జరపి వెళ్ళగా వాటి నన్నిటినీ తిన్నడు తన కాలిచెప్పుతో తోసి తన తలలో అలంకరించుకునే అడవిపూలను తీసి లింగానికి అలంక రించాడు.

ఈ లింగరూపుడు ఎన్నాళ్ళు గానో తిండిలేక పస్తులున్నట్లు భావించి, తిన్నడు వెంటనే అరణ్య మంతా తిరిగి పెద్ద పందిని వేటాడాడు. దాని మాంసం చీల్చి దోరగా కాల్చి బాగుంది అని నిర్ధారణ చేసుకొని ప్రేమగా లింగ రూపుడికి దొన్నెలతో అందించాడు.

ఆరగించమని ప్రార్థించి ప్రార్థించి చివరకు ఆరగించకపోతే ప్రాణాలు తీసుకుంటానంటూ స్వామి లింగంపై వాలి ఏడ్వటం ప్రారంభించాడు. కైలాస పతి మనసు ద్రవించింది. తిన్నడు తెచ్చిన మాంసం ముక్కలు ఎంగిలిని ఏవగించు కొనకుండా పరమానందంగా భుజించాడు. ఇలా తిన్నడు రోజూ స్వామిని కొలుస్తూ వుండి పోయాడు.

ఇలా బోయవాని ఎంగిలి తిని శ్రీకాళహస్తీశ్వరుడు తనకు భక్తుల యందు గల అపార వాత్సల్యాన్ని జూపినందువల్లే ఉచ్ఛిష్ట (ఉత్ + శిష్ట) క్షేత్రమైంది శ్రీకాళహస్తి.

## కన్నులర్పించినవాడు

ఆచారం, సాంప్రదాయ శుద్ధి, పవిత్రత లాంటి వేవీ తెలీక, తన కిష్టమైన రీతిలో పూజిస్తున్న తిన్నడిని పరీక్షించ దలిచాడు శివుడు. అందుకు తగినట్లు గానే ఎంగిలి దొప్పలు, ఎముకలు, పుల్లలు శివలింగంపై పడివుండటం చూసి, ఈ కశ్మలపు పనిచేసిన వాడెవడో చెప్పకపోతే ప్రాణం తీసుకుంటానని శివ బ్రాహ్మణుడు స్వామి ముందు శపథం చేశాడు. అందుకు అతడో కిరాతుడు. అవలంబించేదీ అశాస్త్రీయ పద్ధతే అయినా త్రికరణ శుద్ధిగల అతని భక్తి, ఆరాధన గమనించమని జవాబిచ్చాడు పరమేశ్వరుడు.

ఎప్పటివలె తిన్నడు ఎంగిలి మాంసం అందియ్యగా శంకరుడు తినలేదు సరికదా కంటినుండి బొట బొటా నీరు కార్చాడు. స్వామికి నేత్ర వ్యాధి కలిగించని తనకు తెలిసిన ఆకు పసర్లు తెచ్చి వేసినా ఆగక రక్తం బొట్లు బొట్లుగా కారసాగింది. ఇక దిక్కు తోచక, కంటి బాధకు కన్నే మందని భావించి, బాణం కొనతో తన కన్ను పెకలించి పరమేశ్వరుని కంటికి అమర్చాడు.

అయితే ఇప్పుడు రెండో కంటి నుండి రక్తం బొట్లు బొట్లుగా స్రవించడం మొదలైంది.తిన్నడు తన రెండో కన్ను కూడ అర్పించడానికి నిశ్చయించుకున్నాడు. చూపు లేకుండా లింగ రూపుడి కన్ను గుర్తించడం వీలుకాదని, పరమేశుని కన్ను గుర్తించడానికై ఆ స్వామి కంటి కొనను తన కాలి చెప్పుతో తన్ని పట్టి, మరోసారి బాణం కొనతో తన రెండవ కన్నును పెకలిస్తుండగా శివుడు ప్రత్యక్షమై 'కన్ను లిచ్చిన కన్నప్పా ఆగు' అంటూ గట్టిగా అరిచాడు.

అతని కన్నులు అతనికి తిరిగి ప్రసాదించాడు. వారి కోరిక మేరకు తిన్నడిని, శివ బ్రాహ్మణుడిని తనలో ఐక్యం చేసుకొని, మోక్షం ప్రసాదించాడు. పాండవ మధ్యముడైన అర్జునుడే మోక్షం కోసం తిన్నడుగా జన్మించాడని పురాణ కథనం.

శివుడికి కన్నులిచ్చినందువల్ల తిన్నడు కన్నప్ప అయ్యాడు. అతని భక్తికి, ఆరాధనకు ప్రసన్నుడైన శివుడు కన్నప్ప తన పక్కనే వుండాలని కోరుకున్నాడు. అందుకనే ఆలయంలో శివలింగం పక్కనే కన్నప్ప విగ్రహం వుంటుంది. అంతేకాదు కన్నప్పకు పూజలు జరిపిన తర్వాతనే పరమేశ్వరునికి పూజలు జరుగు తాయి.

ఆ ఆలయంలో భక్తుడు భగవంతుని సాన్నిధ్యంలో వుండి సేవలు అందుకోవడం విశేషం! కాళహస్తీశ్వరుని శివరాత్రి ఉత్సవాలు కన్నప్ప పూజలతో ప్రారంభమౌతాయి.

## శ్రీ కాళహస్తీశ్వరుడు

ఈ క్షేత్రంలోని లింగాన్ని పూర్వం ఒక సాలె పురుగు, పాము, ఏనుగు పూజించి ముక్తి పొందాయి. గనుకనే దీనికి శ్రీకాళహస్తి అని, ఈ మూడు ప్రాణులకు మోక్షమిచ్చిన దేవుడిని శ్రీకాళహస్తీశ్వరుడని పిలుస్తున్నారు.

సాలె పురుగు స్వామిచుట్టూ గూడు అల్లి పూజించింది. పాము మణులు, రత్నాలతో పూజిస్తూ ఏనుగు తన తొండంతో నీరు తెచ్చి లింగాన్ని అభిషేకిస్తూ పూజించాయి. ఆ విధంగా స్వామిని వీరు తమ తమ పూర్వజన్మ జ్ఞానంతో పూజించగా ఈ మూడింటికి మోక్షం లభించింది. 'శ్రీ' అనగా సాలెపురుగు. 'కాళ' మనగా పాము, 'హస్తి' అనగా ఏనుగు. ఈ మూడింటికి ముక్తి లభించినందువల్ల ఈ క్షేత్రానికి శ్రీకాళహస్తి అని పేరొచ్చింది. ఇందుకు వీటి చిహ్నాలు గర్భాలయంలో లింగంపై వున్నాయి.

వాయులింగం గాకుండా స్వయంభువైన మరోలింగ ముంది. ఇది మానవ నేత్రాలకు గోచర మయ్యేది. ఇది కాళహస్తీశ్వరుని గర్భాలయంలో వుంది. దీనిపై సాలెపురుగు, ఏనుగు దంతాలు, అయిదు శీర్షాల సర్పము భక్తుడు కన్నప్ప పరమేశ్వరునికి ఇవ్వజూపిన కన్ను చిత్రించి వున్నాయి.

శ్రీకాళహస్తీశ్వరుడు 'స్వయంభువు' అని చెప్పడానికి గుర్తుగా స్వామికి ముందున్న ప్రాచీనమైన నంది తెల్లరంగులో వుంది.

## స్వామిని తాకరు

తిరుపతి వెంకన్న గుడిలో ప్రత్యేకించి అర్చకత్వం నిర్వహిస్తున్న వైఖానసులకు మాత్రమే ఏడుకొండల వాడిని తాకేందుకు అవకాశం, అర్హత వున్నాయి. అయితే భరద్వాజ గోత్రీకులైన 'గురుకుళ్' అని పిలవబడే కాళహస్తీశ్వరుని అర్చకులు ఏ పూజా సమయంలోనూ కాళహస్తీశ్వర లింగాన్ని తాకరు.

స్వామికి అభిషేకం చేసే సమయంలో కూడా లింగాన్ని తాకకుండా అభిషేకిస్తారు. అలంకారాలన్నీ స్వామివారి కవచానికే చేస్తారు.

రెండు అడుగుల ఎత్తుగల పానపట్టంపై మూడు అడుగుల ఎత్తుగల ఈ శివలింగం పశ్చిమాభి ముఖంగా వుంది.

## పంచకాల పూజలు

దేశంలో అనేక గొప్ప క్షేత్రాలున్నాయి. కానీ శ్రీకాళహస్తీశ్వరునికి జరిగినన్ని పూజా కైంకర్యాలు మరే క్షేత్రంలోనూ జరుగవేమో! ప్రాతః సంగవ , మధ్యాహ్న, అపరాహ్న, సాయాహ్న - అనే అయిదు కాలాల్లోనూ ఈ క్షేత్రంలో పూజా కైంకర్యాలు జరగడం విశేషం! అంటే ప్రతి 14.4 నిమిషాల వ్యవధికి ఈ ఆలయంలో పూజా కైంకర్యోత్సవాలు జరుగుతుంటాయి. అనాది కాలంగా వస్తున్న ఈ కార్యక్రమాలు అత్యద్భుతం.

**ప్రాతఃకాలం :**

శ్రీ కాళహస్తీశ్వరునికి జ్ఞాన ప్రసూనాంబికా దేవికి అభిషేకం, స్వామికి, వారి దేవేరికి మహానివేదనం, మంత్రపు నీరాజనం, పరివార దేవతలకు నైవేద్యం.

**సంగవ కాలం:**

అమ్మవారికి, స్వామివారికి అభిషేకం, నైవేద్యం.

**మధ్యాహ్న కాలం:**

స్వామివారికి, అమ్మవారికి మహాభిషేకం.

**అపరాహ్నకాలం:**

దర్బారు కాలం (కొలువు దీరే సమయం)

**సాయంకాలం:**

అమ్మవారికి, స్వామివారికి అభిషేకం, మహానైవేద్యం, మంత్ర పుష్ప నీరాజనం.

ప్రతి రాత్రి తొమ్మిది గంటల వేళలో ఏకాంత సేవ, ఇవిగాక నిత్య వార, పక్ష మాస, సంవత్సరోత్సవా లున్నాయి.

**నిత్యోత్సవం:**

ప్రతి రోజూ రెండో కాల పూజ అయ్యాక గుడిప్రాకారంలో ఊరేగింపు.

**వారోత్సవం:**

ప్రతి శుక్రవారంజ్ఞాన ప్రసూ నాంబికా దేవి ఉయ్యాలోత్సవం. సాయంకాలం ప్రాకారం లోపల ఊరేగింపు.

**పక్షోత్సవం:**

ప్రతి త్రయోదశినాడు ప్రదోష పూజోత్సవం. నందిసేవ, మాసోత్సవం. ప్రతి అమావాస్య నాడు గ్రామోత్సవం.

ఇక్కడ కైలాసాచలం, కనకా చలం, విద్యాచలం అని మూడున్నాయి అందులో కైలాసాచలం కన్నప్ప కొండ, కనకాచలం దుర్గమ్మ కొండ. విద్యాచలం సుబ్రహ్మణ్యేశ్వరుని కొండ. ఈ కొండ లపై ఆయా ఋతువులలో ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

వసంత ఋతువులో గుడి ప్రాకారం లోపల పొగడమాను క్రింద స్వామి అమ్మ వార్లకు అభిషేకారాధ నలు, వసంతోత్సవం జరుగు తాయి.

కార్తీక మాసంలో స్వామికి – లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకు మార్చన, సోమవారం ఏకాదశ రుద్రాభి షేకం, పౌర్ణమినాడు చుక్కానీ ఉత్సవం.

మార్గశిర మాసంలో ఆర్ద్రోత్సవం. ఆ రోజు తెల్లవారుఝామున ఉష్ణోద కంతో (వేడి నీరు) అభిషేకం. మధ్యాహ్నం నటరాజస్వామికి అభిషేకం ఉత్సవం (ఆరుద్రా నక్షత్రయుక్త పౌర్ణమి రోజు).

పుష్యమాసంలో (తమిళులకి తై అమావాస్య) బహుళ అమావాస్య నాడు స్వామివారు 'లోబావి' అని పిలిచే భారద్వాజ తీర్థానికి వేంచేస్తారు.

ఆశ్వయుజ మాసంలో, కనకా చలంపై (దుర్గమ్మ కొండ) అమ్మవారి తొమ్మిది అవతారాలతో నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి.

ధనుర్మాసంలో సంక్రాంతి పర్వ సందర్భంగా స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవం జరుగుతుంది. 14 మైళ్ళ దూరం స్వామి ప్రదక్షిణగా వస్తారు.

మాఘమాసంలో – రథసప్తమి ఉత్స వం – సూర్యప్రభ వాహనం – గ్రామోత్సవం జరుగుతుంది. శుద్ధ ఏకాదశి నాడు కాళహస్తీశ్వరస్వామివారు విద్యాచలంలో వున్న సుబ్రహ్మణ్య స్వామి వారి సన్నిధికి వెళ్తారు.

శివునికి ఓంకార ఉపదేశం చేసినవాడు కుమారస్వామి. అందుకే స్వామిని స్తుతించేటప్పుడు, కుమారుని గురువుగా కలవాడు కాబట్టి ''కుమార గురవే నమః'' అంటారు. మాఘ పౌర్ణమినాడు సువర్ణముఖీ నదిలో స్వామికి పూజా కైంకర్యాలు జరుగు తాయి.

ఆ రోజు నదీ తీరంలో సద్యోముక్తి వ్రతం వినిపిస్తారు. ఈ క్షేత్రానికి సద్యోముక్తి క్షేత్రమని కదా పేరు! ఈ మాఘ మాసంలోనే మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి.

ఇలా ఏడాదిలో మొత్తంమీద ఈ ఆలయంలో 85 పర్వదినోత్సవాలు జరుగుతాయి.

### మహాశివరాత్రి

మాఘమాసంలో కృష్ణ పక్షాన చతుర్దశితో కూడిన రోజు పరమేశ్వరునికి

అత్యంత ప్రీతికరమైన రోజు అదే శివరాత్రి పర్వదినం.

ఒకసారి బ్రహ్మ విష్ణుమూర్తులిరువురు అహంకారంతో తమలో ఎవరు గొప్ప అని పోటీలు పడుతుండగా, శివుడు వారిద్దరికి గుణపాఠం నేర్పించడానికై పూను కొని వారిద్దరి మధ్య దివ్య తేజస్సుతో జ్యోతిర్లింగంగా రూపుదాల్చాడు. ఈ లింగానికి మొదలు చివర ఎక్కడున్నాయో తెలుసుకోవాలని, విష్ణుమూర్తి వరాహ రూపంతో జ్యోతిర్లింగంయొక్క అడుగు భాగాన్ని వెదుకుతూ వెళ్ళాడు. బ్రహ్మ దేవుడు పై భాగాన్ని తెలుసుకోవాలని పక్షి రూపంతో ఆకాశమంతా ఎగిరాడు. అయితేనేం వీరిద్దరూ శివుని తేజోలింగం యొక్క మొదలు, చివర కనుక్కోలేక పోయి, ఓడిపోయి పరమేశ్వరుని శరణు వేడారు. పరమేశ్వరుని ఆధిక్యతను గుర్తించి, అహంకారాన్ని వదలి ఆయన్ను పూజించి తరించారు. ఆ పర్వదినమే మహా శివరాత్రి.

మాఘమాసాన బహుళ చతుర్దశి నాడు తెల్లవారక ముందేలేచి, స్నానం చేసి పరమేశ్వరుని పూజా ద్రవ్యాలతో అర్చించి, శివస్తోత్ర గానాలతో ఆ పగలు, రాత్రి జాగరణ చేసి లింగోద్భవ సమయమైన మూడో జాములో స్వామిని పూజించి, మరునాడు పగలంతా మేల్కొంటే విశేష ఫలం లభిస్తుంది.

తొలిరోజు నాలుగోజాములో మారేడు దళాలతో పూజ చేయడం విశేషమైనదిగా భావిస్తారు. అలాగే కృష్ణ పక్షంలో అష్టమి, చతుర్దశి తిథుల్లోనూ ప్రదోష కాలంలోనూ పూజ శివునికి ఇష్టమైనది.

శివుడు క్షీరసాగర మథనంనాడు కాల కూట విషాన్ని కంఠంలో నిలిపి లోకాన్ని రక్షించిన సాయం సంధ్యా కాలమే ప్రదోష కాలం. ఈ కాలంలో పూజ గొప్ప ఐశ్వర్యా న్నిస్తుందని శివగీత చెబుతోంది. అందుకే అన్ని విధాలా భక్తి ముక్తి జ్ఞానైశ్వర్యాలనిచ్చేది కాబట్టి జన్మకో శివరాత్రి చాలన్నారు.

## గౌరీ కల్యాణ ప్రశస్తి

గౌరీకల్యాణ వైభోగమే! లోకానికంతా మహద్భాగ్యమే! కల్యాణాల్లో గౌరీ కల్యాణమే ఉత్తమమైంది. మహా శివరాత్రి సందర్భంగా పన్నెండు రోజుల ఉత్సవాలలో గౌరీ కల్యాణం భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది.

మహాశివరాత్రినాడు పరమేశుడు నంది వాహనం మీద, జ్ఞానాంబిక సింహ వాహనం మీద ఊరేగింపు జరుగుతుంది. గంటకొక అడుగుగా ఊరేగే ఆ దృశ్యం చూడ వలసిందే.

శివరాత్రి మరునాటి ఉదయ లగ్నంలో పిండితో తయారు చేసిన లింగానికి అభిషేకం చేస్తారు. అప్పుడు భక్తులు దర్శించుకొనేదే లింగోద్భవకాల దర్శనము.

ఎనిమిదవరోజు గౌరీకల్యాణం. ఆ రోజు రాత్రి శ్రీకాళహస్తీశ్వరస్వామి ముందుగా ఆలయం నుంచి కల్యాణ మండపానికి చేరుకుంటాడు. ఆపైన పెండ్లికి సూత్రధారుడుగా చండికేశ్వరుడు అమ్మవారితో బాటు బయలుదేరి విడిది గృహం లో బసచేస్తారు. కంకణపూజ, యజ్ఞోప వీతం, మాంగల్య పూజ జరిపిన తర్వాత కల్యాణ తంతు ఆసక్తికరంగా జరుగు తుంది.

ఆ సుముహూర్తానికి పెండ్లి చేసుకునే పెండ్లి కుమారులు, పెండ్లి కుమార్తెలు వేలాదిగా కల్యాణ మంటపానికి సమీపంగా చేరి, గౌరీదేవికి (జ్ఞాన ప్రసూనాంబికకు) సూత్రధారణ జరిగే సమయంలో తామూ సూత్రధారణ చేస్తారు.

## ఎవరిని ముందు పూజించాలి

శ్రీకాళహస్తి క్షేత్రానికి కాల భైరవుడు క్షేత్రపాలకుడు. ఆయన ఆలయాన్ని సంరక్షించే దేవుడు. శివాలయాల్లో మొట్ట మొదట క్షేత్రపాలకుని పూజిస్తారు. ఆయన్ను అలా దర్శించి పూజించనిదే పరమేశ్వరుని దర్శించి పూజించిన ఫలితం దక్కదని అంటారు. శివాలయాల్లో క్షేత్ర పాలకుడు దిగంబరుడై చిరుగంటలు, కపాలమాల అలంకరించుకుని ఆలయంలో ఈశాన్య దిక్కున వుంటాడు. విగ్రహం చుట్టూ జ్వాలాప్రభ, వెనుక భైరవ రూపం.

కాలభైరవుడు దక్షయజ్ఞం భగ్నపరచ డానికి శివునికి తోడ్పడ్డాడని, బ్రహ్మ తన ఐదవ శిరస్సుతో శివుని దూషి

స్తుండగా, కాల భైరవుడు శివుని శరీరం నుంచే పుట్టి బ్రహ్మ యొక్క ఐదవ తలను ఖండించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

అగస్త్యుడు జ్ఞాన ప్రకాశక తీర్థంలో స్నానం చేసి కాళహస్తీశ్వరుణ్ణి పూజించి నూరేళ్ళు తపస్సు చేసినా ఇంద్రుడు భగ్న పరిచాడు. దీనికి కారణం తాను మొదట క్షేత్రపాలకుడైన భైరవుని పూజించక పోవడమేనని తెలుసుకొని, తిరిగి భైరవుని భక్తి శ్రద్ధలతో పూజించగా భైరవుడు ప్రసన్నుడయ్యాడు. అగస్త్యుడు తన తపో నిష్ఠకు కలుగుతున్న ఆటంకాల్ని దూరం చేయమని కాలభైరవుని కోరాడు. మునీంద్రుని తపస్సుకు భంగం కలిగిస్తున్న అప్సరసలు తనను మోహించే విధంగా భైరవుడు అతి సుందర రూపం ధరించెను. వారితో కేళీ విలాసాలు జరిపి, చివరకు తన భీకర రూపాన్ని చూపేసరికి అప్సరసలతో బాటు మన్మథుడు కూడా భయభీతుడై ఆశ్రమం వదలి పారిపోయాడు. అగస్త్యుడు భైరవుని దయవలన తపస్సిద్ధి పొందాడు. భక్తులకు కాలభైరవుని అనుగ్రహం అవసరమన్నది దీనిని బట్టి స్పష్టమవుతుంది.

## పురుషామృగం

కాళహస్తీశ్వరుని ఆలయంలోకి ప్రవేశించగానే మొదట పురుషామృగం కనబడుతుంది. పురుషా మృగాన్ని తాకగానే భక్తుని అశుచి దోష నివారణ మవుతుందని చెబుతారు.

ఈ ఆలయంలోని గోడని ఆనుకనే వున్న సువర్ణముఖీ నది భూమట్టానికి లోపలనే ప్రవహిస్తూ 'అంతర్వాహిని' కావడం వల్ల ఇక్కడికి వచ్చే భక్తులు దైవ దర్శనానికి ముందు కాళ్ళు చేతులు కడుగుకోడానికి కూడా నీటి సౌకర్యం లేనందువల్ల అశుచి దోషమేదైనా వుంటే నివారణ చేయ డానికి దైవ సాన్నిధ్యానికి వెళ్ళక ముందే పురుషామృగం ప్రతిష్ఠిత మైంది.

పూర్వం పాండురాజు కుమారుడు ధర్మరాజు రాజసూయ యాగం చేసిన సందర్భంగా వేలాది మంది అతిథులు భుజించి వదిలిన ఎంగిలి విస్తరాకులను తానే స్వయంగా ఎత్తే సమయంలో అశుచి దోషం అంటకుండా నాటి పెద్దల సూచన మేరకు భీముని పంపి పురుషామృగాన్ని తెచ్చినట్లు ఒక కథ ప్రచారంలో వుంది.

## జ్ఞాన ప్రధాన క్షేత్రం

చరిత్ర ప్రసిద్ధమైన నల్లమల పర్వతాలు ఆదిశేషుని రూపమని తిరుమల తలగాను, అహోబిలం శరీరంగాను, శ్రీశైలం తోకగాను శ్రీకాళహస్తి వాక్కుకు స్థానమైన ముఖము గాను పురాణాలు చెబుతున్నాయి. అందు చేత కూడా ముఖద్వారమైన కాళహస్తీశ్వర క్షేత్రం జ్ఞానోపదేశ స్థానంగా చెప్పడం సమంజసం.

ఇక్కడ జగన్మాత అంబ యక్ష ప్రాశస్త్యంగా గొప్ప తేజోరూపంతో ప్రభవించి దేవతలకు ఉపదేశించినట్లు కేనోపనిషత్తుద్వారా తెలుస్తోంది.

ఇందుకు నిదర్శనంగా ఆలయానికి 8 కిలో మీటర్ల దూరంలో సదాశివ గుహ అనిపిలిచే 'యక్ష గుహ' ఈనాటికి వుంది. ఆలయంలో ప్రవేశించేటప్పుడు జ్ఞానగురువైన దక్షిణా మూర్తి రూపం ఎదురుగా కనబడుతుంది. దక్షిణా మూర్తి ఆలయంలో వుండటమే ఇది జ్ఞాన ప్రధాన క్షేత్రమని చెప్పడానికి గుర్తు.

సనకాది ఋషులకు, పరబ్రహ్మ తత్త్వం ఉపదేశం చేయడానికే మహేశ్వరుడు దక్షిణా మూర్తిగా వట వృక్షం క్రింద మూర్తీభవించిన ఆనంద రూపంతో గురురూపియై అనుగ్రహించాడు. ఇటువంటి విగ్రహం మరెచ్చటా లేదని అంటారు. పుణ్యం చేత సుఖము, జ్ఞానంవల్ల ముక్తి పొందుతాం! దక్షిణామూర్తిని దర్శించడంతో జ్ఞానానికి తోవ కనబడుతుందన్నమాట. ఇందువల్లనే శ్రీ కాళహస్తి జ్ఞానోపదేశ క్షేత్రంగా ప్రసిద్ధి కెక్కింది.

ఈ క్షేత్రంలో వ్యతిరేక దిశలో ఓనోడ్స్ వుండటంవల్ల ఈ క్షేత్రం దర్శించిన వారికి ప్రశాంతత, ఏకాగ్రత చేకూరుతుంది.



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులందరూ ముందుగా శ్రీవారి పుష్కరిణి చెంత వున్న శ్రీ వరాహ స్వామివారిని దర్శించాలి. ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయం.